డబుల్ బెనిఫిట్‌తో

# సింగిల్ పేజీ కథలు

## గాలిదేవత

అది మా ఇంటికి వచ్చినప్పటి నుండి మా అందరికీ ఎంతో సంతోషంగా ఉంది. ఇంట్లో అంతా సందడి. ఏదో కొత్త ఉత్సాహం.

ఇంటికి ఎవరొచ్చిన చూపంతా దానిమీదే. ఎవరొచ్చినా దాని పేరడగడము. మా వాళ్ళు చెప్పగానే అది విప్పారిన మొహంతో వాళ్ళని చూస్తూ తిరుగుతుంది. నాకు మాత్రం దానికి ఎక్కడ జ్వరమొస్తుందో అని ఒకటే బెంగ.

మా అమ్మాయికి అది లేకపోతే ఒక క్షణం తోచదు. ఎంతసేపు దాని — గొడవే. మా పెద్దాడు కాలేజీ నుంచి రాగానే దాని మీద చెయ్యేస్తాడు. అదేమో ఎక్కడ లేని ఉత్సాహంతో వాడెటు తిరుగుతూ వుంటే వాణ్ని చూస్తూ చాటంత మొహం వేసుకొని తిరుగుతుంది. నాకేమో వాడలా తిరుగుతూంటే వాడి చెయ్యి దానికెక్కడ తగులుతుందో అని ఒకటే భయం. వాడికి నోరు తెరచి చెబుదామనుకొంటే, నీకు అన్నీ అనుమానాలు, నాకంత మాత్రం తెలీదా, అంటాడు. అందుకని చూస్తూ వూరుకొంటాను.

అది అప్పుడప్పుడు అలుగుతుంది. అలకపోగానే మళ్ళా ఏమెరుగనట్లు చాటంత మొహం వేసుకొని మా చుట్టూ తిరుగుతూ మా పనులకు సహాకారమిస్తుంది.

అది మా ఇంటికి వచ్చి అప్పుడే ఆరు సంవత్సరాలవుతోంది. అది మాతో ఒకటిగా కలిసిపోయింది. ఎందుకో ఈ మధ్య దానికి జ్వరమొస్తోంది. అప్పుడప్పుడు మా పెద్దాడు దానికి తగిన మాత్రలు వేస్తూనే ఉన్నాడు. కాని అది ఇక నా వల్ల కాదు అంటూ ఓ మూల కూర్చుండిపోయింది.

మా పెద్దాడు కొంచెం డబ్బు వసతి చేసుకొని దానికి తగిన వైద్యుడి దగ్గరికి తీసుకువెళ్ళాడు.

ఓ వారం తరువాత ఇంటికి వచ్చింది. మళ్లీ మామూలే తన చాటంత మొహం వేసుకొని అందర్నీ గమనిస్తూ తన పని చేసుకుపోతోంది. కాని ఇప్పుడు ఇంటికి ఎవరొచ్చినా దాని సంగతి, పేరు అడగటం లేదు. అయితే ఈ మధ్య ఒకటే గరగర అని దగ్గుతూ తిరుగుతోంది. మళ్ళా వైద్యుడి దగ్గరికి పంపించాలి. నాకేమో ఇదొచ్చినప్పటి నుండి కొద్దిగా ఖర్చు పెరిగినా కొంత సుఖముంది.

సరే ఇంతకీ అది ఎవరనుకుంటున్నారు? అది మా ప్రియమైన ఫ్యాను కథ.

—ఎ.కె.అనూరాధ

*10–447*, సంతపేట,

నెల్లూరు.

*

## సన్మానం

గుబ్బల సత్యనారాయణమూర్తి

జి.సత్యనారాయణమూర్తి
జూనియర్ లెక్చరర్
పెదపాడు.

"సోదర సోదరీమణులారా! మన గ్రామం పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ ఇంతవరకూ బస్సు సౌకర్యానికి నోచుకోక ప్రజలు ఎన్ని అవస్థలుపడ్డారో మీకందరికీ తెలుసు. ఈ ఆర్.టి.సి. డిపోమేనేజర్ రామబ్రహ్మంగారు మనపాలిట దేవుడిలా వచ్చి ప్రభుత్వంతో పోరాడి మనకు ఒక మినీ బస్ సౌకర్యం కల్పించారు. అందుకే మన సంతోషాన్ని వ్యక్తం చేసుకోడానికి ఆయనకు మన కృతజ్ఞతలు తెల్పుకోడానికి ఈ సన్మాన సభ ఏర్పాటు చేయబడింది. మన ఊరి సర్పంచ్‌గారు డిపోమేనేజర్‌గారిని పూలమాలలతో సత్కరించి నూతన వస్త్రాలు బహూకరిస్తారు" అని తన ఉపోద్ఘాతాన్ని ముగించాడు సభా నిర్వాహకుడు.

సభాధ్యక్షుడు సర్పంచ్‌గారు లేచి డిపో మేనేజర్‌గారి నిజాయితీని పొగిడి "చంద్రునికో నూలుపోగులా ఈ సత్కారాన్ని స్వీకరించవలసిందిగా కోరుతున్నాను" అని ఆయనకు పూలమాల వేయబోయాడు.

"ఆగండి" చెయ్యిపైకెత్తి అభ్యంతరం తెల్పారు రామబ్రహ్మంగారు. అధ్యక్షునితోసహా సభలోని అంతా నిర్ఘాంతపోయారు. సభాధ్యక్షుని చేతిలో పూలమాల వెలవెలబోతోంది.

"ఈ సన్మానం చెందవలసింది నాకు కాదు. అదిగో అక్కడ సభలో ఉన్న గుర్రబ్బండి భద్రయ్యకు. భద్రయ్యను వేదికమీదికి రావలసిందిగా ఆహ్వానిస్తున్నాను" డిపో మేనేజర్ మాటలు సభలో కలకలం రేపాయి.

భద్రయ్య వేదికమీదకి వచ్చాడు బెదురు బెదురుగా.

"నాకు మీరు చేస్తున్న ఈ సన్మానం ఈ గుర్రబ్బండి భద్రయ్యకు చెందడమేమిటి అని ఆశ్చర్యపోతున్నారు కదూ! చెప్తాను. ఇప్పటికి సుమారు ఓ నెల్రకితం నేను స్వంత పనిమీద ఈ ఊరికి రావలసి వచ్చింది. ఆ రోజున అమలాపురం నుంచి ఇక్కడికి రావడానికి ఇతని బండి ఒక్కటే ఉందక్కడ. ఇతన్ని అడిగాను బండి కట్టమని. కేవలం పది కిలోమీటర్ల దూరానికి ఇరవై ఐదు రూపాయలు డిమాండ్ చేసాడీ వ్యక్తి. గత్యంతరం లేక ఇతని బండి ఎక్కాను. మళ్లీ తిరిగి రావడానికి మరో పాతికరూపాయలు చెల్లించవలసి వచ్చింది. అప్పుడే అనుకున్నాను. ఈ ఊరి ప్రజలు బస్ సౌకర్యం లేకపోవడంవల్ల ప్రజల అవసరాన్ని అవకాశంగా తీసుకుని డబ్బును విపరీతంగా గుంజే ఈ గుర్రబ్బండి వ్యక్తి చేతిలో ఎన్ని అవస్థలు పడుతున్నారో అని. వెంటనే ప్రభుత్వానికి రాసి ఈ చిన్న రూట్‌కు మినీబస్ శాంక్షన్ చేయించడం జరిగింది. కాబట్టి ఈ రూట్ రావడానికి పరోక్షంగా ఈ భద్రయ్యే కారణం కాబట్టి ఈ సన్మానం ఇతనికే చెందాలి" అంటూ అధ్యక్షుని చేతిలో పూలమాల భద్రయ్య మెడలో వేసి, నూతన వస్త్రాలు అతని భుజంపై కప్పాడు రామబ్రహ్మంగారు.

సభలో చప్పట్లు మారుమోగాయి. వేదికమీద భద్రయ్య మాత్రం నవ్వాలో ఏడవాలో తెలీక ఇబ్బందిగా ముఖం పెట్టాడు.

*

గోపాలం కథరాసి నాకు చూపెట్టాడు. నిజానికి కథ చాలా బాగుంది. కాని నాలోని 'ఈర్ష్య' నా చేత అతని కథ అంతగా బాగోలేదని చెప్పించింది.

కానీ కొన్నాళ్ళ తర్వాత అతని కథ ఓ మాగ్‌జైన్‌లో అచ్చయిందని తెలిసింది. క్లాసులో అందరూ ఏకధాటిగా అతనిని మెచ్చుకుంటున్నారు. కొంతమంది లెక్చరర్లు కూడా అతనిని అభినందించారు. నాలో 'ఈర్ష్య' ఇంకా ఎక్కువైంది. అసలు అతని కథ ప్రచురణ అనర్హమని కానీ 'ఫలానా' పత్రిక సబ్ ఎడిటర్ ఇతనికి బాగా తెలుసని అందుకే కథ ప్రచురణకు నోచుకొందని... అంతా రికమండేషన్

ఈ పేజీల్లో కథ ప్రచురిస్తే చాలు. మీకు కథలు రాయడం వచ్చేసినట్టే! అంటే రచయితగా, రచయిత్రిగా మీ భవిష్యత్తుకు ఈ పేజీ సోపానమనుకోండి. రచయిత(త్రు)లకు రెమ్యునరేషన్‌తోపాటు ఆంధ్రభూమి పశంసాపత్రం ప్రత్యేకంగా లభిస్తుంది! ఈ పేజీ కథ మీ రైటింగ్‌లో ఒక పేజీ మాత్రమే వుండాలి.